
"సాయంకాలమైంది! మధ్యాహ్నం మూడింటికే తగలడతానన్న గురప్ప పంతులు ఇంత వరకూ ఐపు, అజా లేదు. ఎక్కడ పడి అఘోరిస్తున్నాడో ఏమో" పేకదస్తాను కత్తెర వేస్తూ విసుగ్గా గొణిగాడు గిరీశం. టేబిల్ చుట్టూ కుర్చీలో వున్న ముగ్గురికీ పేకముక్కలను పంచాడు.

"పెద్ద డ్రామా ఆర్టిస్టు గదా మన వాడు. సమయానికి ఏ దర్శకుడికో, రైటరుకో దొరికిపోయి వుంటాడు. ఓ పక్క మన సిటింగ్ మీద మనసు పీకుతూ వుంటుంది. డైలాగులు తప్పులు చెప్పి, ఏ రిహార్సల్లోనో ముక్క చీవాట్లు తింటూ వుంటాడు" అన్నాడు చిట్టిబాబు ముక్కలు సరిచేసుకుంటూ.



# డామిట్... కథ అడ్డం తిరిగింది

తిరుపతి టౌన్లోని ఒక సెంటర్లో పేరొందిన రిక్రియేషన్‌క్లబ్ అది. ఆదివారమూ, అందునా సాయంత్రం పూట కాబట్టి రద్దీతో కిటకిటలా డుతూ వుంది.

"షో ఫినిష్! ఇద్దరూ మళ్లీ చెరో యాభై సమర్పించుకోండి" అన్నాడు డాక్టర్ బసవరాజు పేకముక్కల్ని టేబిల్‌పై పరుస్తూ దర్పంగా.

"రెండు క్షణాల్లో ఆటకొట్టేసే టెక్నిక్ ఏదో నాకూ నేర్పకూడదూ... ఇప్పటికిది నీకిస్తున్న మూడో యాభై వరసాగా" జేబులోంచి పచ్చ నోటు తీస్తూ గొణిగాడు గిరీశం.

"టెక్నిక్కా, గాడిద గుడ్డా. ప్రాక్టీస్ మేక్స్ ఏ మేన్ పర్ఫెక్ట్. నా ప్రాక్టీసుకు వేళయ్యింది. బై - పేకాట రాయుళ్లిద్దరికీ కన్నుకొట్టి యాభై నోట్లను జేబులోకి కుక్కుకొని బయటకు నడిచాడు డాక్టర్ బసవరాజు.

"వీడి సిగదరగా, ఎముకల స్పెషలిస్టుగా పేషెంట్లను బాది సంపాదించింది చాలక, పేకాట్లో కూడా మనల్ని దద్దమ్మలను చేసి ఎలా దోచుకుంటున్నాడో చూడవయ్యా గిరీశం" అన్నాడు చిట్టిబాబు. గిరీశం పరధ్యానంగా తల వూపాడు.

నుదుట పావలా కాసంత కుంకుమ బొట్టుతో క్లబ్‌లోకి రొప్పుతూ ప్రవేశించాడు గురునాథం.

"ఏం గురువా, డ్రామా రిహార్సల్స్‌లో బాగా దెబ్బలు తిని వస్తున్నట్లున్నావ్, ముఖం అలా వేలాడేశావు నీరసంగా" నవ్వుతూ అడిగాడు గిరీశం.

గురుమూర్తి బాధతో మూలిగాడు. "నా ముఖానికి రిహార్సలు ఒక్కటే తక్కువ. మా ఆవిడ రమ ముదురు భక్తి నీకు తెలిసిందే గదా, ఆదివారమైతే చాలు... వూళ్లో వున్న గుళ్లన్నిటిలో ప్రదక్షిణాలు చేయకపోతే గానీ బొత్తిగా తోచదామెకు. ఉదయం ఐదింటికే చచ్చినట్లు లేచి, శివాలయంలో అర్చనతో మొదలెట్టి, రాముల వారి గుడిలో అష్టోత్తరం, రాజేశ్వరీ దేవి కోవెలలో అభిషేకం చూసుకొని, మధ్యలో చిన్న బ్రేక్ తీసుకొని ఇంటికెళ్లి భోంచేసి, ఇప్పుడే సాయిబాబా గుళ్లో హారతి టయానికి దించొస్తున్నాను. మహాతల్లి ఏ కళనుందో, ఆటోలో ఇంటికి వెళ్తానంది. 'బ్రతికానురా దేవుడా' అని వెయ్యిదణ్ణాలు కనిపించిన దేవుడికల్లా పెట్టుకొని చిన్నగా ఇటొస్తున్నాను" నిట్టూరుస్తూ అన్నాడు గురుమూర్తి.

"మందుకు వేళాయెరా" అని కూనిరాగాలు తీసుకుంటూ బేరర్‌ని పిలిచి డ్రింక్సకి ఆర్డరిచ్చాడు చిట్టిబాబు అత్యుత్సాహంగా. గ్లాసులు గలగలలాడసాగాయి.

"ప్రాబ్లం నీదే కాదు గురూ, నేనూ మా ఆవిడ బంధుప్రీతితో చస్తున్నాననుకో. ఆదివారమైతే ఫ్రెండ్స్‌తో హాయిగా మందుకొడ్తూ పేకాడుకోనీకుండా అడ్డమైన చుట్టాలిళ్లకంతా తీసుకెళ్లమని చంపుతుంది. పొద్దున్నే వాళ్ల చెల్లెలు

**రాచపూటి రమేష్**

కనకం ఇంటికి తీసికెళ్ళి, గంటసేపు నానా సోదీ, అక్కా చెల్లెళ్ల వాగుడూ భరించి, అట్నుంచటే వాళ్ల పిన్ని గారింట్లో దించొస్తున్నా మా ఆవిడని. సాయంత్రం ఆరింటికి నన్నక్కడికొచ్చి పికప్ చేసుకోమంది. ఈ వాసన తగిల్తే వాళ్ల పిన్ని ముందరే శివాలెత్తుతుంది. కాబట్టి వెళ్లలేను. రాత్రి ఇంట్లో ఏ కురుక్షేత్రం జరగబోతోందో" విస్కీ, సోడా కలిపిన గాజుగ్లాసులోకి ఐస్ క్యూబ్స్ వేస్తూ అన్నాడు గిరీశం.

"మా ఆండాళ్లు మాత్రం తక్కువ తిందా? సోడాబుడ్డి కళ్లజోడొచ్చినా వారానికి మూడు సినిమాలు చూడ్డం మానలేదు. ఆదివారం రోజు ఠంచనుగా ఆవిడను ఫస్ట్‌షోకి తీసుకెళ్లాల్సిందే. ఇక ఉదయమంతా మార్కెట్టుకూ, షాపింగ్‌కూ వెళ్దామని ప్రాణాలు తోడేస్తూ వుంటుంది" తల బాదుకుంటూ అన్నాడు చిట్టిబాబు.

"అసలు ఈ వెధవ సైంటిస్టులదే తప్పు. మిక్సీలనీ, కుక్కర్లనీ, గ్యాసులనీ కనిపెట్టి ఈ ఆడాళ్లకు బొత్తిగా పని లేకుండా సోమరులను చేసేశారు. అంతా లీజరే వాళ్లకు. కాబట్టి ఎవరు దొరుకుతారా, వేపుకు తిండానికి అని చూస్తూ వుంటారు" సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు గురుమూర్తి అక్కసుగా.

"పోనీ ఖాళీ టైమున్నా ఏ టీవీ ప్రోగ్రాములో చూసుకుంటూ తగలడవచ్చు గదా, మన కార్యక్రమాల్లో మనముంటాం" గ్లాసు ఖాళీచేస్తూ అన్నాడు గిరీశం.

"టీవీనా...? అదేదో 'బంగారం మీ ఇంటికే' కార్యక్రమం తప్ప మా ఆండాళ్లు మరే ప్రోగ్రాం జోలికీ వెళ్లదు" పెదవి విరుస్తూ విచారంగా అన్నాడు చిట్టిబాబు.

"మా ఆవిడ కూడా ఆ ప్రోగ్రామంటే పడి చస్తుందనుకో. కానీ ఆ ప్రోగ్రాం ఆదివారం ఉదయం పదకొండింటికి. అదవగానే మళ్లీ ఆమె నన్ను బయటికి వెళ్లనీకుండా కాల్చుకుతినే ప్రోగ్రాంలోనే వుంటుంది" అన్నాడు గిరీశం.

"మా రమకు కూడా ఫేవరెట్ ప్రోగ్రాం అదే. కానీ ఏం లాభం? అందులో పాల్గొనాలంటే బోలెడంత జనరల్ నాలెడ్జీ, వంటల నాలెడ్జీ, ఆటల్లో ప్రావీణ్యం వుండాలి. 'మా రమ ఇండియా రాజధానేదంటే హైదరాబాదు అనే రకం. ఏం చేద్దాం? అంతా మనకర్మ" అన్నాడు గురుమూర్తి.

గిరీశం గ్లాసు ఖాళీచేసి, క్షణంసేపు కళ్లు మూసుకొని చెప్పాడు. "కనీసం ఆదివారం పూటైనా ఏ టెన్షనూ లేకుండా మనం మందు కొడ్తూ పేకాడుకోవాలంటే నాకొక ట్రెమండస్ ఐడియా తట్టింది".

"ఏమిటది? మన స్త్రీ జనాన్ని వెంటనే పుట్టిళ్లకు తరలించడమా? లేక విడాకులు పుచ్చుకొని సోలో బ్రతుకే సో బెటరనుకోవడమా?" ఆవులిస్తూ అన్నాడు గురుమూర్తి.

"అదేం కాదు..." సిగిరెట్టు వెలిగించి, ఒక దమ్ములాగి చెప్పాడు గిరీశం. "ఎలాగూ మన ముగ్గురి వైఫ్సుకీ ఈ బంగారం ప్రోగ్రాం పిచ్చుంది కదా. వాళ్లకా కార్యక్రమంలో పాల్గొనే ఛాన్సు దొరికితే బంగారం మీద మోజులో ఆ ప్రోగ్రాం ప్రిపరేషన్లో వుండిపోతారు. ఇక ఆ అంకం సమాప్తమయ్యేవరకూ మన జోలికి రారు."

చిట్టిబాబు కోపంగా బల్లపై పిడికిలితో గుద్ది చెప్పాడు. "ఏడ్చినట్టుంది నీ తలాతోకా లేని ఐడియా. కొన్ని లక్షలమంది ఆ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు ఛాన్సు కోసం ప్రయత్నిస్తూ వుంటారు. లక్కీడిప్‌లో మన వాళ్లకు ఆ ఛాన్సు తగిలేదెప్పటికీ? మనకీ బాధల నుండి విముక్తి లభించేదెప్పటికీ?" క్లబ్‌లో మిగిలిన టేబుల్స్‌లో

కూర్చుని వున్నవాళ్లు చిట్టిబాబు అరుపులకు అదిరిపడి వాళ్ల వంక చూశారు గుర్రుమంటూ.

"దానికీ ఒక బ్రిలియంట్ ఐడియా సిద్ధం చేసా. కానీ కొంచెం ఖర్చుతో కూడుకున్న పని" నవ్వుతూ అన్నాడు గిరీశం.

గ్లాసులోని లక్కీ డ్రాప్పు ఖాళీచేసి తూలుతూ చెప్పాడు గురుమూర్తి. "ఎంత ఖర్చైనా ఫర్వాలేదు. బీళ్ల బంట్రోతులా మా ఆవిడ కొంగు పట్టుకొని తిరిగే పని తప్పితే చాలు. ఓ ఐదు వేలు నీ మొఖాన కొట్టేచాలా? ఇప్పుడే ఏటీయమ్‌లో డ్రా చేస్తాను. చెప్పు"

"అంత అవసరం లేదు. కానీ ఇక్కడ కాదు మన డిస్కషన్. అందరూ వింటున్నారు. నాతో రండి" చెప్పాడు గిరీశం.

* * *

"ఔను, మాది 'బంగారం' ప్రోగ్రామ్‌లకు కోచింగ్ ఇచ్చే ఇన్‌స్టిట్యూటే! నాలుగైదు ఛానెళ్లలో ఇటువంటి ప్రోగ్రామ్స్ వస్తుంటాయి. 'జి.కె.లో, ఆటల్లో, వంటల్లో కోచింగు ఇవ్వడానికి సెపరేట్ మాస్టర్లున్నారు. వారానికి మూడు రోజులు – మూడు గంటలపాటు ఇక్కడకు రావాల్సుంటుంది. నెల రోజుల కోచింగ్. ఫీజు మూడువేలు. కిలో బంగారం గెలవాలంటే చాలా చిన్న పెట్టుబడి ఇది" పిల్లిగడ్డం నిమురుకుంటూ నవ్వుతూ చెప్పాడు ప్రొఫెసర్ రావు.

"అదికాదు సార్, మా వాళ్లింత దూరం రాలేరు. మీరే మా ఇళ్లకొచ్చి కోచింగివ్వాలి. అదీ ఆదివారం నాడు రోజంతా" చెప్పాడు గిరీశం.

"ఆదివారమా? ఎంత మాత్రం వీలవదు, అసలు మా సంస్థకది శలవు రోజు" కంగారుగా చెప్పాడు ప్రొఫెసరు రావు.

"మరేం ఫర్వాలేదు. ఫీజెంతైనా ఫర్వాలేదు. అడ్వాన్సుగా ఇదుంచండి" ఐదువేల కట్ట రావు చేతిలో పెడ్తూ చెప్పాడు గిరీశం.

రావు మొఖం విప్పారింది. "అలాగే. ఎలాగో కోచ్‌లని ఒప్పించి, మీ ఇళ్లకు ఆదివారం నాడు పంపుతాం" అన్నాడు నవ్వుతూ.

* * *

ఒక శుభోదయం గురుమూర్తి ఇంట్లో ఫోను మోగింది. అష్టోత్తరం చదువుకుంటున్న రమ, ఫోను తీయమని భర్తకు సైగ చేసింది. ఐతే ఆమెను గమనించనట్లు మూర్తి షేవింగ్ చేసుకుంటూ వుండిపోయాడు. చివరకు లెంపలేసుకొని రమే ఫోన్లో మాట్లాడింది.

వెంటనే మడీ, గిడీ, మరచిపోయి గురుమూర్తి చేతులు పట్టుకొని వూపేస్తూ, "ఏమండీ, ఇన్నాళ్లకూ లక్ష్మీదేవి మనల్ని కరుణించింది. 'బంగారం' ప్రోగ్రాంలో పాల్గొనేందుకు ఛాన్సు దొరికింది. జూన్ పద్దెనిమిదో తారీఖు 'ఆహా' ఛానెల్ వాళ్లు మనింటికొస్తున్నారట. మరో ఇద్దర్ని సిద్ధం చేసుకోమన్నారు" అంది ఆనందంగా.

"కంగ్రాట్స్, ఈ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు మా ఫ్రెండొకరు కోచింగిస్తున్నారు. అతనికి చెప్పమంటావా?" తాపీగా అడిగాడు గురుమూర్తి.

"చెప్పమంటావా ఏంటండి? వెంటనే కోచింగుకు ఏర్పాటు చేయండి. చీటీలో నేను, ఆండాళ్లు, జయ సేవ్ చేసిన డబ్బుంది. ఫీజు ఎంతైనా మేమిచ్చుకుంటాం" అంది రమ తన్మయత్వంతో.

"ఆ... ఫీజు పెద్ద ఎక్కువేం కాదు. ఓ పది వేలుంటుందేమో. ఐతే ఆదివారాలు మాత్రమే వాళ్లు కోచింగిస్తారు. నీకు ఇబ్బంది లేదా" అడిగాడు గురుమూర్తి టెన్షన్‌గా.

"ఏ రోజైతే ఏమిటండి? ఆదివారమైతే మరీ మంచిది. మీరూ, పిల్లలూ ఏ హొటల్లోనో భోంచేయవచ్చు. వెంటనే కోచింగ్‌కు ఏర్పాటు చేయండి" అంది రమ.

వెంటనే గురుమూర్తి మేడమీదకు వెళ్లి సెల్లో గిరీశాన్ని కాంటాక్ట్ చేసి "ప్లాన్ సక్సెస్ గురూ. ఇక ఎనిమిది ఆదివారాలు మనం ఫ్రీ.. కంగ్రాట్స్" అన్నాడు. ఎక్సైటింగ్‌గా.

* * *

కాలింగ్ బెల్ మోత వినగానే సిద్ధంగా వున్న రమ పరుగున వెళ్లి తలుపు తెరిచింది. ఆ సరికి అండాళ్లు, జయ కూడా పట్టుచీరల్లో, ఏడువారాల నగలతో సింగారించుకొని 'టీవీ ఛానెల్' వారికోసం ఎదురుచూస్తూ వున్నారు.

ఖరీదైన పట్టు చీరలో రిచ్‌గా కనిపిస్తూ, చేతిలో మైక్ పట్టుకొని ఓ అమ్మాయి, జీన్స్, టీ షర్టులతో చేతిలో వీడియో కెమెరాతో మరో కుర్రాడు, ఇద్దరు సహాయకులూ లోనికి ప్రవేశించారు.

"మేము ఆహా ఛానెల్ నుండి వస్తున్నాం. బైదిబై... మీరిప్పుడు ఇంట్లో ఆహా ఛానెలే చూస్తున్నారా?" పళ్లన్నీ కనిపించేలా నవ్వుతూ అడిగింది యాంకరమ్మ ఇంట్లోకి వచ్చీ రాగానే.

"ఆహా... వారం రోజులనుండీ ఆ ఛానెల్ తప్ప మరొకటి చూడ్డమే లేదు. కూర్చోండి. కూల్‌డ్రింక్స్ పట్టుకొస్తాను" అంది రమ సంబరంగా.

"అవేం వద్దు లెండి. మేము ఎవరిళ్లల్లోనూ పచ్చి మంచినీళ్లు కూడా ముట్టం. పైగా మాకు మరో నాటకానికి టైమవుతోంది" వాచ్ చూసుకుంటూ చెప్పింది యాంకరు పిల్ల.

"నాటకమా? అదేమిటండి" ఆశ్చర్యంగా అడిగింది జయ.

'ఐమీన్... మరో ఎపిసోడ్ షూటింగ్‌కు టైమవుతోంది. బైదిబై ప్రోగ్రామ్ మొదలెడ్దామా?' నాలిక్కరుచుకొని చెప్పింది యాంకరు.

ఎంత కోచింగ్ తీసుకున్నా ముగ్గురు అతివలకూ కంగారుగానే వుంది.

పాటల పోటీలో జయ మిగతా ఇద్దరి కన్నా ఎక్కువ మార్కులు స్కోర్ చేసింది. పురాణాల గురించి అడిగిన ప్రశ్నల్లో అండాళ్లు, గేమ్స్ రౌండ్‌లో రమ మార్కులు ఎక్కువగా సాధించారు.

"మీలో ఏ ఒక్కరూ అన్ని రౌండ్స్‌లో రాణించలేదు కాబట్టి మీకు బంగారం ఇవ్వలేం. మా ఛానెల్ నుండి పట్టుచీరలు మాత్రం ప్రజెంట్ చేస్తున్నాం" అని ముగ్గురికీ తలో పట్టుచీర ప్రజెంట్ చేసింది యాంకర్. అమ్మళ్ల ముగ్గురి మొఖాలూ బాధతో వెలవెలపోయాయి.

యాంకర్ గాళ్ చీర సర్దుకుంటూ లేచి "ఇక వెళ్లొస్తామండి. మా ప్రోగ్రాంలో పాల్గొన్నందుకు ధన్యవాదాలు. వెళ్లేముందో చిన్నమాట. మా ఛానెల్ పేరుతో కొందరు డూప్లికేట్లు ఇళ్లకొచ్చి మా ఛానెల్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొనే ఛాన్సిస్తామని డబ్బులు కూడా వసూలు చేస్తున్నారట. వారి మాయలో పడకండి" అని వార్నింగిచ్చి మరీ బయలుదేరింది.

మహిళలు ముగ్గురూ తమ దుస్థితికి తీవ్రంగా దుఃఖిస్తూ వుండగా మళ్లీ కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీసిన రమ ఎదురుగా వున్న మరో టీవీ బృందాన్ని, వారి కెమెరాలనూ చూసి ఆశ్చర్యపోయింది. అంతలో ఆమెకు ఇందాక యాంకర్ గాళ్ ఇచ్చిన వార్నింగ్ గుర్తుకొచ్చింది.

"నమస్తే. మేము ఆహా ఛానెల్ నుండి వస్తున్నాం. బంగారం మీ ఇంటికే ప్రోగ్రాంలో పాల్గొనేందుకు మీరు అప్లై చేశారుగదా. మీరు చాలా లక్కీ. ఇన్నాళ్లకు మీకు ఛాన్సు తగిలింది. మేమిలా వచ్చేసాం" చొరవగా ఇంట్లోకి వస్తోందో చుడీదార్ అమ్మాయి. ఆమెతో బాటు కెమెరాలతో మరో ఇద్దరు వున్నారు.

అసలే ఆగ్రహావేశాలతో వున్న ముగ్గురు హౌస్‌వైఫులూ చేతికందిన వస్తువులతో కొత్త టీవీ బృందంపై దాడి చేశారు. కొంతసేపు ఆ ఇంట్లో గందరగోళ పరిస్థితి నెలకొంది.

చావు తప్పి కన్ను లొట్టబోయిన యాంకర్ ఆడవాళ్లు ముగ్గుర్నీ మాటల్లో పెట్టి, జరిగిన విషయాన్ని తెలుసుకొంది.

"ఇంట్లోకి వచ్చిన వాళ్లు తమ ఐడీ కార్డు చూపారా? కెమెరాకు మా లోగో వుందా? ఎవరు అసలు, ఎవరు నకిలీనో తెలుసుకోలేని మూర్ఖులు మీరు. మీతో మాకేం పని" అని విసురుగా వెళ్లిపోయారు వారు.

మిత్రత్రయానికి షాక్ తగిలినట్లైంది.

"మొదట వచ్చిన వారి మెడలో ఐడింటిటీ కార్డుగాని, కెమెరాకు లోగో కానీ లేదు. కాబట్టి వాళ్లే డూప్లికేటు్లు, అంటే..."

రాకరాక ఆహా ఛానెల్ వాళ్లు తమ ఇంటికొస్తే, నకిలీ యాంకరు చెప్పిన మాయమాటలకు లొంగిపోయి, అసలు ఛానెల్ బృందానికి బడితపూజ చేసి మరీ సాగనంపారు. గడప వరకూ వచ్చిన బంగారాన్ని కాలదన్నారు. ఎంత దారుణం..."

మరి... నకిలీలైతే తమని మోసం చేయక పోగా పట్టుచీరలు ఇచ్చి మరీ ఎందుకు వెళ్తారు? మనసులో అనుమానం ప్రవేశించిన ఆ మహిళలకు ఇదంతా "తమ వ్యసనాలకు అడ్డు తగుల్తున్నామని దుగ్ధతో వారి పతిదేవులు ఆడించిన నాటకమే" అని తెలుసుకొనేందుకు ఎంతోసేపు పట్టలేదు.

ఇన్నిరోజులూ కోచింగు పేరుతో ఆడవాళ్లను బిజీచేసి, ఆదివారాలు తమ ఎంజాయ్‌మెంట్లో తామున్న గిరీశం, చిట్టిబాబు, గుర్నాధాలు తమ నాటకంలో చివరి అంకం పూర్తి చేశారు. టీవీ బృందం పేరుతో తాము పంపిన నాటకాల వాళ్లకు వారి వేషాలకు, వారు తెచ్చిన పట్టుచీరలకు డబ్బిచ్చి ఇంటి దారి పట్టారు.

ఇంట్లోకి అడుగుపెట్టగానే ఉగ్రరూపంలో వున్న ఇల్లాళ్లను చూసి వారికి మతిపోయింది. ఖరీదైన బంగారు కానుకలను తమ భార్యలకు సమర్పించుకొని, వారిని శాంతింపచేసేసరికి వారి తలప్రాణం తోకకొచ్చింది.

ప్రోగ్రాంలో పాల్గొనకుండానే ఈ విధంగా బంగారం తమ ఇంటికి వచ్చినందుకు ఆడవాళ్లు ముగ్గురూ మురిసిపోయారు. ●

## బండారు ఈశ్వరమ్మ అవార్డ్

డిసెంబర్ 16, 17 తేదీలలో హైదరాబాద్‌లో కళా సుబ్బారావు కళావేదికలో 'తెలుగు కథానికా సదస్సు' నిర్వహించబడుతుంది. ఈ సదస్సుకు ప్రతినిధులుగా హాజరైన వారి నుంచి ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి, వారికి 'బండారు ఈశ్వరమ్మ అవార్డ్' ప్రదానం చేయబడుతుంది. ఈ అవార్డ్ క్రింద రు. 1,116/- నగదు, ఇతర సత్కారాలు లభిస్తాయి. ఆసక్తిగలవారు ఈ తెలుగు కథానికా సదస్సుకు ప్రతినిధులుగా హాజరు కావలసిందిగా నిర్వాహకులు కోరుతున్నారు. ఇతర వివరాలకు కళాప్రపూర్ణ పోతుకూచి సాంబశివ రావు (ఫోన్: 040-27533177) గారిని సంప్రదించవచ్చు.